www.kandilinews.com

# కందిలి

న్యూస్.. దారిచూపే దీప శిఖ

మంగళవారం | 21.04.2026 సంపుటి: 01 | సంచిక: 254 | వెల: రూ. 4 /- TGTEL/25/A 1800




మీ ప్రాంతంలోని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదా? అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదా? ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారా?.. ఇలాంటి సమస్యలు ఏవైనా సరే.. 'కందిలి' దృష్టికి తీసుకురండి.

**70365 45130**

నంబరుకు వాట్సాప్ చేసి వివరాలు అందించండి. అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కథనాలు అందించి, సమస్యల పరిష్కారానికి మా బాధ్యతగా కృషి చేస్తాం.

ఇట్లు.. టీం కందిలి




















# సంగారెడ్డిలో... ఘనంగా బసవేశ్వర జయంతి

- **మహాత్మ బసవేశ్వరునికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించిన టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి**

**కందిలి, సంగారెడ్డి:** మహాత్మ బసవేశ్వర జయంతి సందర్భంగా టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి సంగారెడ్డిలోని బసవేశ్వరుని విగ్రహాలకు పూల మాలలు సమర్పించారు. మొదట సంగారెడ్డి పట్టణంలోని ఎలక్ట్రిసిటీ కార్యాలయంలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం బైపాస్ రోడ్డులోని బసవేశ్వర విగ్రహానికి ఆమె పూలమాలలు సమర్పించారు.

**కాయకమే కైలాసమని చెప్పిన.. మహనీయుడు!**

ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాయకమే కైలాసం అని మహాత్మా బసవేశ్వరుడు శ్రమ యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పారన్నారు. సామాజిక సంస్కరణల కోసం కృషి చేయడంతో పాటు సామాజిక అసమానతలు, కుల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్తగా బసవేశ్వరుడి పాత్రను నిర్మల జగ్గారెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ ఛైర్ పర్సన్ కూన వనిత సంతోష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, నాయకుడు కూన సంతోష్, కౌన్సిలర్లు వంశీ, హరిష్ తదితరులు పాల్గొన్నారు.









# కుంటలో మట్టి తవ్వి...
# ఎఫ్‌టీఎల్ నింపేస్తున్నారు!

- **రూ.15లక్షలకు డీల్ మాట్లాడుకొని నీటి వనరును దెబ్బతిసేలా కొందరి దందా**
- **కుంటలోని మట్టినే తవ్వుతూ ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూమిలో పోస్తున్న తీరు**
- **గ్రామమంతా వ్యతిరేకిస్తున్నా యథేచ్ఛగా కొనసాగుతున్న మట్టితవ్వి, నింపే పనులు**
- **హత్నూర మండలం కొడిపాకలోని హనుమాన్ కుంట వద్ద ఇదీ పరిస్థితి**

**కందిలి, హత్నూర**

నీటి వనరు స్వరూపాన్ని దెబ్బతిసే పనిలో భాగంగా ఆ కుంటలోని మట్టినే వాడుతున్నారు. ఎఫ్టీటీఎల్ పరిధిలో ఉన్న భూమి ఎత్తు పెంచేందుకు ఇలా చేస్తున్నారు. స్థానికంగా ఉండే నేతలు ఈ దందాలో కీలకంగా ఉన్నారు. రూ.15లక్షలకు బేరం మాట్లాడుకొని మరీ ఈ పని చేయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా, వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులు చొరవ చూపడం లేదు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కొడిపాక గ్రామంలో సాగుతున్న దందాపై 'కందిలి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

**హనుమాన్ కుంటలో...**
**అక్రమ దందా!**

కొడిపాక గ్రామ పరిధిలో హనుమాన్ కుంట ఉంది. ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ కొందరికి వ్యవసాయ భూములున్నాయి. ఇందులో కొంత భూమిని చాలా తక్కువ ధరకే కొనుగోలు చేసిన ఒకరు... ఆ భూమిలోకి నీళ్లు రాకుండా ఎత్తు పెంచాలని అనుకున్నారు. ఇందుకోసం స్థానికంగా ఉన్న నేతలతో ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఇష్టారాజ్యంగా హనుమాన్ కుంటలో తవ్వకాలు మొదలయ్యాయి. కుంట మట్టిని తవ్వుతూ, తిరిగి ఆ కుంటనే పూడ్చే ప్రయత్నం చేస్తున్నారు.

**ఎలాంటి అనుమతులు లేకుండా!**

కుంటలో మట్టిని తవ్వాలంటే మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ తదితర శాఖల నుంచి అనుమతులు ఉండాలి. గ్రామ పంచాయతీ కూడా ఇందుకు ఒప్పుకోవాలి. కానీ ఇలాంటివేవీ లేకుండానే యథేచ్ఛగా హనుమాన్ కుంటలో తవ్వకాలు సాగిస్తున్నారు. స్థానికులు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. ఈ పనులు ఆగడం లేదు. కేవలం తమకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి, కొందరు ఈ తవ్వకాలు, ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూముల్లో మట్టి నింపే పనిని దర్జాగా చేసేస్తున్నారు.

**అధికారుల సంగతి..**
**మేం చూసుకుంటామంటూ!**

ఈ వ్యవహారానికి రాజకీయ అండ ఉందన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి. "ఎవ్వరైనా అధికారులు వస్తే మేమే చూసుకుంటాం" అంటూ ధైర్యంగా చెప్పుకుంటూ కొందరు ఈ అక్రమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కుంటలో పట్టపగలే తవ్వకాలు చేస్తున్నా, ఎందుకు అడ్డుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నీటి వనరు స్వరూపాన్ని దెబ్బతీయడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే ఈ మట్టి దందాపై ఉన్నత స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## బాధ్యులపై.. వాల్టా చట్టం కింద కేసులు!

**ఫర్హీన్ షేక్, తహసీల్దారు, హత్నూర**

కొడిపాకలో అక్రమ మట్టి తవ్వకాల విషయం ఇప్పటికే మా దృష్టికి వచ్చింది. స్థానికులు ఈ అంశమై ఫిర్యాదు చేసారు. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టడం చట్టవిరుద్ధం. వెంటనే హనుమాన్ కుంట వద్దకు వెళ్లి పరిశీలిస్తాం. అక్రమంగా మట్టి తవ్వుతూ, ఎఫ్టీఎల్ పరిధిలో పోస్తున్న వారిని గుర్తిస్తాం. వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేస్తాం.















# న్యాయం చేయాలంటూ... సిగాచీ బాధితుల మొర!

- ప్రజావాణికి వచ్చి అధికారులకు కన్నీళ్లతో వినతులు
- తమకు వేతనాలు ఇప్పించడంతో పాటు చికిత్స అందేలా చూడాలని వేడుకున్న క్షతగాత్రులు
- రూ.కోటి పరిహారం త్వరగా ఇప్పించాలని విన్నవించిన మృతుల కుటుంబీకులు
- కార్మికుల హక్కులైన PF, ESIలను పరిహారంలో కలిపి చూపించొద్దన్న టీపీజేఏసీ ప్రతినిధులు
- బాధితుల వద్దకే వచ్చి వినతిపత్రం స్వీకరించిన జిల్లా అడిషనల్ కలెక్టర్ పాండు

**కందిలి, సంగారెడ్డి**

సిగాచీ పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదం కారణంగా తమ జీవితాలు ఛిన్నాభిన్నమయ్యాయని, ఆప్తులను కోల్పోయి జీవచ్ఛవాలుగా బతుకుతున్నామని మృతుల కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. తీవ్ర గాయాలపాలై, మెరుగైన చికిత్స అందుకోలేక నరకయాతన అనుభవిస్తున్నామని క్షతగాత్రులు తమ ఆవేదనను వినిపించారు. తమకు ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరుతూ సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో తమ గళం వినిపించారు. అడిషనల్ కలెక్టరు పాండు బాధితుల వద్దకే వెళ్లి వినతి పత్రం తీసుకున్నారు. వారితో మాట్లాడారు. సమస్యలను తెలుసుకున్నారు.

**అండగా... టీపీజేఏసీ!**

సిగాచి పరిశ్రమ ప్రమాద బాధితులకు పూర్తి స్థాయి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్వహించిన 'మహా ధర్నా' కొనసాగింపుగా తెలంగాణ పీపుల్ జాయింట్ యాక్షన్ కమిటీ (TPJAC) ఆధ్వర్యంలో బాధితులు ప్రజావాణిలో జిల్లా అడిషనల్ కలెక్టర్ పాండును కలిశారు.

**1. క్షతగాత్రుల చికిత్స, వేతనాలపై హామీ!**

ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దీర్ఘకాలికంగా వైద్యం పొందుతున్న రాజేష్ కుమార్ చౌదరి, సుష్మ, దివ్యల పరిస్థితిని అడిషనల్ కలెక్టరు పాండు ప్రత్యేకంగా పరిశీలించారు. ఈఎస్ఐ వైద్యుల సలహా మేరకు ఆసుపత్రిలో చికిత్సను తప్పనిసరిగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి చికిత్సకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. వీరికి రావాల్సిన పెండింగ్ వేతనాలను కూడా కంపెనీ ద్వారా ఇప్పిస్తామని జరుగుతుందని బాధితులకు భరోసా ఇచ్చారు.

**2. రూ.1 కోటి పరిహారంపై ప్రతిష్టంభన**

మరణించిన 54 మంది కార్మికుల కుటుంబాలకు, ఒక్కో కుటుంబానికి రూ.కోటి పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ అంశం కూడా ప్రజావాణిలో చర్చకు వచ్చింది. అడిషనల్ కలెక్టరు పాండు స్పందిస్తూ.. ప్రస్తుతం హైకోర్టులో కేసు నడుస్తోందన్నారు. కోర్టు తుది తీర్పు ప్రకారమే పరిహారం చెల్లింపు ప్రక్రియ ఉంటుందని ఆయన వివరించారు.

**3. ముఖ్యమంత్రి మాటను... అవమానించడమే ఇది!**

అడిషనల్ కలెక్టరు పాండు ఇచ్చిన సమాధానంపై TPJAC సంగారెడ్డి జిల్లా కన్వీనర్ వై. అశోక్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభు గౌడ్ తీవ్రమైన అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధితుల వద్దకు వచ్చారని గుర్తు చేశారు. ఒక్కొక్కరికి రూ. కోటి పరిహారం చెల్లిస్తామని బహిరంగంగా హామీ ఇచ్చారని వివరించారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట ఇచ్చిన తర్వాత, మళ్ళీ కోర్టు తీర్పుల కోసం బాధితులు వేచి చూడమనడం అంటే అది ఆయన మాటలను అవమానపరచడమే అవుతుంద"ని అశోక్ కుమార్, ప్రభు గౌడ్ మండిపడ్డారు.

**కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా... పరిహారం ఇవ్వాల్సిందే!**

కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రతి బాధిత కుటుంబానికి రూ.కోటి నికర పరిహారం అందేలా ప్రభుత్వం కంపెనీపై ఒత్తిడి తీసుకురావాలని, లేదంటే ప్రభుత్వమే చెల్లించాలని TPJAC, బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. కార్మికుల హక్కులైన పీఎఫ్ (PF), ఈఎస్ఐ (ESI)లను పరిహారంలో కలిపి చూపించే కంపెనీ కుట్రలను అడ్డుకోవాలని కోరింది. ఈ కార్యక్రమంలో TPJAC జిల్లా ప్రతినిధులు శ్రీధర్ మహేంద్ర (కోఆర్డినేటర్), ఆర్. లక్ష్మి (కోకన్వీనర్), ఎ. మానస (కోకన్వీనర్), బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్ పాటిల్, బీసీ కార్యదర్శి సుధాకర్, ప్రధాన కార్యదర్శి కోటి వీరమణి, కార్యదర్శి ముత్యాని శ్రీనివాసులు, సిగాచి బాధితులు ప్రీతి కుమారి, ఇందు, సోనియా కుమారి, జుంరుమియా, మున్మున్ సింగ్, అనిరుద్ రాజేష్, చార్మినాదేవి తదితరులు 22 మంది బాధితులు పాల్గొన్నారు.







# ఫసల్‌వాదిలో వైభవంగా ఆద్యశిలాస్థాపనోత్సవం!

- శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి చేతుల మీదుగా నిర్వహణ
- పూజా కార్యక్రమాలలో పాల్గొన్న నీలం మధు దంపతులు

కందిలి, సంగారెడ్డి

సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని, పీఠాధిపతులతో పాటు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి దివ్య పర్యవేక్షణలో అత్యంత అరుదైన 'మహమేరు దేవాలయ' నిర్మాణానికి ఆద్యశిలాస్థాపనోత్సవం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్ పాల్గొన్న ఈ ఉత్సవాలు వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి.

**ఉదయం నుంచే... ప్రత్యేక పూజలు!**

సోమవారం ఉదయం 8:01 గంటలకు గణపతి పూజ, గురుపూజతో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. అనంతరం భక్తులందరూ కలిసి సామూహికంగా నిర్వహించిన శతావర్తన హనుమాన్ చాలీసా పారాయణంతో ఆ ప్రాంతమంతా భక్తి భావాన్ని నింపింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుణ్యాహవాచనం, వాస్తుపూజ, నవకుంభ ఆవాహనము, పంచశిలా సంస్కారం, అఘోర హోమం వంటి క్రతువులను వేద పండితులు శాస్త్రీయంగా నిర్వహించారు.

**ధర్మశాస్త్ర ప్రమాణాలతో... దేవాలయ నిర్మాణం!**

ఈ సందర్భంగా మహేశ్వర సిద్ధాంతి మాట్లాడుతూ, భూమి పూజ నుంచి శిఖర ప్రతిష్ఠ వరకు అత్యంత కచ్చితమైన ధర్మశాస్త్ర ప్రమాణాలతో ఈ దేవాలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆద్యశిలలపై భక్తులు స్వయంగా బీజాక్షరాలు లిఖించడం ద్వారా వారి వంశాభివృద్ధి జరుగుతుందన్నారు. పంచ మహాపాపాలు తొలగి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని ఆయన ఆకాంక్షించారు. సాయంత్రం వేళల్లో అమ్మవారి గర్భాలయ ప్రవేశం, ఆద్యశిలాస్థాపన (పంచశిలేష్టికాన్యాసం) వంటి ప్రధాన ఘట్టాలు జరిగాయి. ఈ చారిత్రాత్మక నిర్మాణానికి దేవాలయ స్థపతులు జి. సుబ్రహ్మణ్యం, ఎస్. సెంథిల్ హేమంతాచార్యులు తమ నైపుణ్యాన్ని అందిస్తున్నారు. ఈ పూజ కార్యక్రమాలలో పాల్గొంటున్న నీలం మధు దంపతులకు ఆలయ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఈ మహత్తర కార్యక్రామానికి భారీగా తరలివచ్చిన భక్తుల కోసం నిర్వాహకులు అన్నప్రసాద వితరణ తీర్థప్రసాదాల ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.











# సాయం నుంచి స్వాభిమానానికి...

## దివ్యాంగులకు ప్రభుత్వం తోడు!

- టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి
- దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటడ్ వీల్ చైర్ల పంపిణీ

**కందిలి, సంగారెడ్డి**

దివ్యాంగులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారు ఆత్మన్యూనతా భావానికి లోనుకాకుండా ధైర్యంగా ముందుకు సాగాలని తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (TGIIC) ఛైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి సూచించారు. సోమవారం కందిలో నిర్వహించిన తీవ్రమైన వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ వీల్ చైర్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్పైనల్ కార్డ్ ఇంజూరీస్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (SCIAT) ఆధ్వర్యంలో స్థానిక రైతు వేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, వారికి గౌరవప్రదమైన జీవనం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. కంది గ్రామ సర్పంచ్ చిన్న సాయి శ్రీరామ్ మాట్లాడుతూ, గ్రామంలోని దివ్యాంగులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు అర్హులైన వారికి పెన్షన్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో పంచాయతీ ముందుంటుందని అన్నారు. ఈ సందర్భంగా SCIAT రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. షఫీ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ, తీవ్రమైన వైకల్యం కలిగిన దివ్యాంగులకు ప్రత్యేక నెలసరి ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. బ్యాటరీ వీల్ చైర్ల ద్వారా పదిమంది దివ్యాంగులకు మొబిలిటీ కలగడం ఆనందకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అసద్‌ఖాన్, పంచాయతీ సభ్యులు మహ్మద్‌గౌస్, ఎండి తయ్యబ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మణ్‌గౌడ్ స్కియాట్ రాష్ట్ర మహిళా నాయకురాలు జి.ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. బ్యాటరీ వీల్ చైర్లను అందుకున్న దివ్యాంగులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.








Printed by SAKETH PUBLICATIONS, Published by Surkanti Rajender Reddy on behalf of Surkanti Rajender Reddy. Printed at Sangareddy and Published at H.No. 5-8-134/8, Plot No.75, Chanakyapuri Colony, Near St.Anthony School, Sangareddy, Telangana- 502001, Editor: Surkanti Rajender Reddy, RNI. NO. TGTEL/25/A 1800. Ph.7036545130. Emai id: Kandilinews@gmail.com